సాక్షి
చిత్తూరు

గురువారం, 18, జూలై, 2024




బైక్ దొంగ అరెస్ట్

కాణిపాకం పోలీసులు బుధవారం ద్విచక్ర వాహనాల దొంగను అరెస్టు చేసి, 12 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

బైక్‌ను తప్పించబోయిన ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకెళ్లి నిలిచిపోయింది. - 8లో



అంతరిక్షాన్ని చూసేద్దాం

తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌లో బుధవారం డిజిటల్ ప్లానిటోరియాన్ని కార్పొరేషన్ కమిషనర్ పునఃప్రారంభించారు. - 8లో



> తమ్ముళ్లూ! మీ కలలు సాకారం చేస్తా.. ఇంటికో ఉద్యోగం ఇస్తా..లేదంటే నిరుద్యోగ భృతి కింద మూడు వేలు ఇస్తా..అని ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నెల దాటినా దీనిపై పెదవి విప్పడం లేదు.. 2014లోనూ రూ.2వేలు భృతి ఇస్తానంటూ ఆ తర్వాత హామీ నెరవేర్చలేదు.

జిల్లా సమాచారం

పీజీ పట్టభద్రులు 80,250	వృత్తి విద్య పూర్తి చేసిన వారు 1,90,255	గ్రామీణ కుటుంబాలు 7,37,322
డిగ్రీ పట్టభద్రులు 2,45,890	సాధారణ విద్యావంతులు 3,73,318	పట్టణ కుటుంబాలు 3,02,631
డీఎడ్ చేసిన వారు 1,50,240	జిల్లాలోని మొత్తం కుటుంబాలు 10,39,953	విద్యావంతులు (పురుషులు) 6,50,450
		విద్యావంతులు (మహిళలు) 3,89,503
		రూరల్‌లో విద్యావంతులు 7,54,650
		అర్బన్‌లో విద్యావంతులు 2,85,303



భృతి భ్రాంతియేనా!

- నిరుద్యోగ భృతిని పట్టించుకోని కూటమి సర్కారు
- ఎన్నికలకు ముందు ఓట్ల కోసం హామీ
- గెలిచాక ఆ ఊసే ఎత్తని ప్రభుత్వం
- భృతి కోసం యువత ఎదురుచూపులు



"ఉద్యోగం లేని ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కల్పించే బాధ్యతను నేను తీసుకుంటాను. ఉద్యోగం వచ్చే వరకు యువతకు ప్రతి నెలా రూ.3000 నిరుద్యోగ భృతి ఇస్తాను." అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన చంద్రబాబు, సీఎం కుర్చీ ఎక్కాక ఆ ఊసే ఎత్తలేదు. ప్రతి సారీ ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగులకు హామీ ఇవ్వడం, తరువాత చేతులెత్తేయడం 1995 నుంచే చంద్రబాబుకు అలవాటుగా మారింది. ఈ సారి దీనికి తోడుగా హడావుడి కోసం మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం పెట్టి నిరుద్యోగులపై మరో బండరాయి వేశారు. సీఎం సంతకం పెట్టేశారు కదా అని బీఎడ్ అభ్యర్థులందరూ కోచింగ్ సెంటర్లకు పరుగులు తీశారు. తీరా ఆ డీఎస్సీ ఎప్పుడో తేలకపోవడంతో అయోమయంలో పడ్డారు. ఇప్పుడు కనీసం ఆ నిరుద్యోగ భృతి అనే మాట అయినా చంద్రబాబు నోటి నుంచి ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలన్నర గడిచిపోయింది. అయితే ఇప్పటి వరకు నిరుద్యోగ భృతిపై స్పష్టమైన ప్రకటనరాలేదు. జాబ్‌క్యాలెండర్ గురించి అసలు ఊసే లేదు. తొలిసంతకం అంటూ హడావుడి చేసిన మెగా డీఎస్సీ విషయంలోనూ ఇప్పటివరకు స్పష్టత లేదు. దీనికి తోడు గత ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేయడంతో సన్నద్ధం అవుతున్న నిరుద్యోగులు భయాందోళనకు లోనవుతున్నారు. టెట్ నోటిఫికేషన్ మాత్రం ఇచ్చి మిన్నకున్నారని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. మెగా డీఎస్సీ ఇస్తారని ఆశలు పెట్టుకున్న వేలాది మంది తిరుపతి, విజయవాడ, కర్నూలు, నెల్లూరు తదితర ప్రాంతాలకు వెళ్లి కోచింగ్ సెంటర్‌లలో శిక్షణ పొందుతున్నారు. నెలనెలా వేలాది రూపాయలు ఫీజులు చెల్లిస్తున్నారు. కనీసం ఆరు నెలలు కోచింగ్ తీసుకుంటే రూ.70 వేల నుంచి 80 వేల వరకు ఖర్చు అవుతుంది. మరి కొన్ని చోట్ల రూ.లక్ష దాటుతుంది. ఇప్పటి వరకు మెగా డీఎస్సీపై క్లారిటీ ఇవ్వకపోవడంతో శిక్షణ పొందుతున్న వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. అంత వరకు నిరుద్యోగ భృతి అయినా ఇస్తారనుకుంటే అది కూడా స్పష్టత లేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



2019లో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు, నిరుద్యోగులు

గతంలోనూ ఇలాంటి మోసమే!

జిల్లాలో లక్షలాదిమంది నిరుద్యోగులను గతం (2014–19)లో చంద్రబాబు మోసం చేశారు. అప్పట్లోనూ ఇదేలా నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి గద్దెనెక్కిన ఆయన ఆ తర్వాత పెడచెవిన పెట్టారు. తీరా ఎన్నికల సమయంలో యువతను ప్రసన్నం చేసుకునేందుకు తూతూమంత్రంగా అమలు చేశారు. మూడంటే మూడు నెలలు మాత్రమే భృతి పేరుతో సాయం చేశారు. రెండు నెలలు రూ.వెయ్యి, మూడో నెల రూ.2 వేలు ఇచ్చారు. 50 నెలలకు పైగా ఇవ్వాల్సిన భృతిని కేవలం మూడు నెలలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం ప్రకటించిన రూ.3 వేల భృతి కూడా గతంలాగే మోసం చేస్తారేమోనని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతి సారీ ఇదే హామీ

నిరుద్యోగ భృతి ఇస్తామంటూ చెప్పడం చంద్రబాబుకు కొత్తేమీ కాదు. ఎన్నికలు వచ్చిన ప్రతి సారీ మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి హామీ తప్పనిసరిగా ఉంటుంది. 1995 నుంచి ప్రతిసారీ ఎన్నికల్లో చంద్రబాబు నిరుద్యోగ భృతి హామీ ఇస్తారు. 2014లో ఇంటికో ఉద్యోగం, ఇవ్వకపోతే నెలకు రూ.2 వేలు భృతి అన్నారు. 2024లో మళ్లీ నిరుద్యోగ భృతి హామీ ప్రకటించారు. ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం వచ్చే లోపు ప్రతి నిరుద్యోగికి నెలకి రూ.3 వేలు చొప్పున ఇస్తామన్నారు. పైగా టీడీపీ రూపొందించిన సూపర్ సిక్స్ హామీల్లో యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగభృతి మొదటి స్థానంలో ఉండడం గమనార్హం. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీపై ఇంత వరకు నోరు మెదపలేదు.



10 లక్షల మంది నిరీక్షణ

జిల్లాలో 10,39,953 మంది నిరుద్యోగులు ఉన్నట్లు ప్రాథమిక లెక్కలు చెబుతున్నాయి. వీరిలో కొంత మంది తప్పని పరిస్థితుల్లో కూలి పనులు చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగం లేక కొందరు చిన్నాచితకా కంపెనీల్లో కార్మికుల్లా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రకటించిన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీలకు ఆకర్షితులై ఓటేశారు. డీఎస్సీ ద్వారా జిల్లాలో కనీసం 650 మందికి మాత్రమే ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన డీఎస్సీతో నిరుద్యోగం తగ్గే పరిస్థితి లేదు. పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తే తప్ప జిల్లాలో నిరుద్యోగం తగ్గదు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా ఏటా 4 లక్షల ఉద్యోగాలు చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలివ్వడం సాధ్యమేనా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. గతంలోలాగా మాయ మాటలు చెప్పి మోసం చేస్తే ఆందోళనలు చేస్తాం. నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే. ఇప్పటికే ఎంతో మంది నిరుద్యోగులు మెగా డీఎస్సీపై ఆశలు పెట్టుకుని శిక్షణ పొందుతున్నారు.

– శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్

కాలయాపన పద్ధతి కాదు



చంద్రబాబు ఈ ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, అప్పటిదాకా ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారం వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. కాలయాపన చేయడం సరైన పద్ధతి కాదు. నిబంధనల పేరుతో కొర్రీలు పెడితే ఊరుకునేది లేదు.

– ప్రవీణ్, విద్యార్థి సంఘం నేత, చిత్తూరు

వెంటనే భృతి ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు దాటింది. ఎన్నికల ముందు నిరుద్యోగభృతి ఇస్తామని ప్రకటించారు. నిరుద్యోగులు శిక్షణ కోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఆర్థిక సమస్యలతో అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం.

– సద్దాం, విద్యార్థి సంఘం నాయకుడు, చిత్తూరు

ఆశతో కోచింగ్‌కు వెళ్తున్నారు



చంద్రబాబు ఈ ఎన్నికల ముందు చేసిన ప్రకటనలపై నిరుద్యోగులు చాలా ఆశలు పెట్టుకున్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, అప్పటిదాకా నిరుద్యోగభృతి ఇస్తామని చెప్పారు. భృతి ఇస్తారన్న ఆశతో కోచింగ్‌లకు వెళ్తున్నారు. వారి ఆశలు అడియాసలు చేయకుండా వెంటనే భృతి ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– సుధాకర్, నిరుద్యోగి, పాలసముద్రం

స్పష్టత ఇవ్వాలి

గతంలోలా ఎన్నికలకు మూడు నెలల ముందు కాకుండా తక్షణమే భృతి ప్రకటించాలి. నిబంధనల పేరుతో కొర్రీలు పెడితే ఊరుకునేది లేదు. ఒక్క నెల నోటిఫికేషన్ ఆలస్యమైతే ఉద్యోగానికి లక్షలాది మంది వయోపరిమితి దాటి ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోతారు. యువగళంలో నారా లోకేష్ రూ.లక్షల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. ఇప్పటికైనా నిరుద్యోగభృతిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

– అఖిల్, రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్ర విద్యార్థి సంఘం



మండల కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో నిత్యావసర వస్తువుల విక్రయానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన బుధవారం క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ప్రతి మండలంలో బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాలు ప్రారంభించాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో ధరల నియంత్రణకు ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ధరల నియంత్రణలో భాగంగా బియ్యం, కందిపప్పు, నూనెలను రైతు బజార్లలో విక్రయించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. స్టీమ్ బియ్యం కిలో రూ.49, పచ్చి బియ్యం కిలో రూ.48, నాణ్యమైన కందిపప్పు (దేశవాళీ) కేజీ రూ.160, పామోలిన్ ప్రియా బ్రాండ్ లీటర్ రూ.90కు విక్రయించాలని ఆదేశించారు. సూచించిన ధరలతో హోల్‌సేల్ పాయింట్‌ల వద్ద ప్రత్యేక కేంద్రాల ద్వారా విక్రయాలు జరపాలన్నారు. ఈ నెల 18 నుంచి ప్రతి మండలంలో విక్రయ కేంద్రాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

22న ప్రసన్నుడి పుష్పయాగం

పుత్తూరు: మండలంలోని అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22న పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 వరకు శ్రీదేవి సమేత శ్రీవారికి స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం 2.40 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పుష్పయాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 21వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు అంకురార్పణ చేయనున్నట్లు వెల్లడించారు.

టమాట రైతుకు కాస్త ఊరట

పుంగనూరు: టమాట ధరలు పెరగడంతో రైతులకు కాస్త ఊరట లభించింది. పట్టణంలోని మార్కెట్‌కు బుధవారం 302 మెట్రిక్ టన్నుల టమాట వచ్చింది. బాక్స్ ధర రూ.520 నుంచి రూ.600 వరకు పలికింది. పుంగనూరు నియోజకవర్గంలో సుమారు 650 హెక్టార్లలో టమాట పంటను పండించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట తెగుళ్ల బారిన పడింది. ఈ తెగుళ్ల నుంచి పంటను కాపాడేందుకు ఎకరాకు సుమారు లక్ష రూపాయల వరకు ఖర్చు చేశారు. ఇన్నిరోజులు టమాటకు ధరలు లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. అయితే ప్రస్తుతం టమాట ధరలు పెరగడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ధరలు ఇలాగే కొనసాగితే టమాట రైతులు అప్పుల ఊబిలో నుంచి బయటపడచ్చని భావిస్తున్నారు.



పుంగనూరు మార్కెట్‌లో టమాట

జిల్లాను హడలెత్తిస్తున్న దోమ

- జిల్లాలో విజృంభిస్తున్న విషజ్వరాలు
- కోట్లు కుమ్మరిస్తున్నా నియంత్రణ కరువే
- నామమాత్రంగా పారిశుధ్య చర్యలు

పలమనేరు: దోమ...దోమ...దోమ.. ప్రస్తుతం ఎవరినోట విన్నా ఈ దోమల గురించే చర్చ. డెంగీ, మలేరియా జ్వరాలకు ఇవే ప్రధాన కారణం. వీటి నివారణ కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలను వెచ్చిస్తోంది. వీటిని బారిన పడి ఆస్పత్రుల్లో జనం లక్షల్లో ఖర్చు పెడుతున్నారు. చూసేందుకు ఇది చాలా చిన్నజీవే. కానీ మనిషి శరీరంపై ఇది చూపే ప్రభావం అంతా ఇంతాకాదు. ఆదమరిస్తే కొన్ని సార్లు ప్రాణాలను తీసేస్తుంది. ప్రస్తుతం జిల్లానే హడలెత్తిస్తున్న జీవి దోమ. ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులకు దోమలే కారణం. పరసరాల శుభ్రత పాటించకపోవడం, చెత్తాచెదారం, బహిరంగ డ్రైనేజీ వ్యవస్థ, నిల్వ ఉన్న నీరు ఇందుకు కారణం. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రస్తుతం పారిశుధ్యం అటకెక్కింది. ప్రభుత్వం గత నెల 18 నుంచి ఈ నెల 30 వరకు గ్రామాల్లో పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ట్యాంకుల శుభ్రం, క్లోరినేషన్ కార్యక్రమాలను చేపడుతోంది. అయితే ఇవి పల్లెల్లో నామమాత్రంగానే సాగుతున్నాయి. ఇక పట్టణాల్లో అయితే సక్రమంగా ఫాగింగ్ చేయడం లేదు.

వ్యాధులకు కారణాలు

డెంగీకి కారణమయ్యే ఈడిస్ ఈజిప్టే దోమ(టైగర్) ప్రస్తుతం జిల్లాలో ఎక్కువగా ఉంది. నల్లగా ఉండే ఈ దోమ ఒంటిమీద తెల్లని చారలు ఉంటాయి. పగటిపూట మాత్రం కుట్టే ఇది మూతలేని నీటి ట్యాంకులు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీరు, తారు రోడ్లు, సిమెంటుమీద నిల్వ ఉండే వర్షపునీరు, ఇళ్లలోని పూల కుండీలు, కూలర్లు, వాడకుండా వదిలేసిన పాత్రలు, కొబ్బరి చిప్పలు, చీకటిగా ఉండే మూలలు, కర్టెన్‌లు వంటి వేలాడే వస్తువులు, ఉపయోగించని గొడుగులు, అలంకరణ సామగ్రి కింద ఉంటాయి. కుట్టిన వారం తర్వాత హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కాళ్లు కదిలించలేని పరిస్థితి ఉంటుంది. ఎముకల కండరాల్లో నొప్పి, శరీరంపై పొక్కులు, దద్దుర్లు వస్తాయి.

మరో జబ్బు మలేరియా

ఈ సీజన్‌లో సోకే మరో ప్రమాదకర జబ్బు మలేరియా. ప్లాస్మోడియమ్ పరాన్నజీవి ఆడ అనాఫిలస్ కల్సిఫేసిస్ దోమ ద్వారా ఇది వ్యాపిస్తుంది. మురుగునీటి కాలువలు, చెరువులు, కుంటలు, పంటకాలువలు, పొలాల్లో ఎక్కువగా ఇవి వృద్ధి చెందుతాయి. ఇందులో ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం పాల్సిఫారమ్ అనేవి రెండు రకాలు, ప్లాస్మోడియం వైవాక్స్ అంత ప్రమాదకరమైంది కాదు, కానీ రెండో రకమే ఎక్కువగా కనిపిస్తోంది. వెంటనే చికిత్స చేయకుంటే కాలేయం, కిడ్నీలు, రక్తకణాలను దెబ్బతీస్తుంది. జిల్లాలోని అటవీప్రాంత గ్రామాల్లో దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఫైలెరియా క్యూలెక్స్ క్వింకే ఫేసియేటస్ దోమ ద్వారా బోధకాలు(ఫైలేరియాసిస్) వస్తుంది. మురుగు, బురద నీరు గుంతలు, సెప్టిక్ ట్యాంకుల్లో ఇవి వృద్ధి చెందుతాయి. ప్రస్తుతం ఈ కేసులు కనిపిస్తున్నాయి. మెదడువ్యాపు వ్యాధి జపనీస్ ఎన్‌సెఫలైటీస్‌గా పిలుస్తారు. పందులను కుట్టిన దోమలు తిరిగి మనుషులను కుట్టడం ద్వారా ఇది వ్యాపిస్తుంది. ఇది పిల్లలకు ప్రాణాంతకంగా పరిణమించే అవకాశాలు ఎక్కువ.





పలమనేరులో లార్వా నిర్మూలనలో వైద్య సిబ్బంది, నిల్వ ఉన్న నీటిలో వృద్ధి చెందిన లార్వా


దోమల నివారణకు నెల ఖర్చు రూ.25 కోట్లు

దోమల నివారణ కోసం నిత్యం కాయిల్స్, రీఫిల్స్ కోసం నెలకు పెట్టే ఖర్చు కోట్లకు చేరుతోంది. నలుగురున్న ఓ ఇంట్లో నెలకు నాలుగు రీఫిల్స్, 30 దాకా కాయిల్స్ కొనాల్సిందే. నెలకు ఈ కుటుంబం ఇందు కోసం వెచ్చించే ఖర్చు రూ.250. ఉమ్మడి జిల్లాలో మొత్తం పది లక్షల కుటుంబాలున్నాయి. ఆ లెక్కన నెలకు దోమల నివారణకు అయ్యే ఖర్చు రూ.25 కోట్లు. ఇది జనానికి భారమే.

మన చేతుల్లోనే మన ఆరోగ్యం

ఎవరో వచ్చి ఏదో చేస్తారని వేచి చూడకుండా మనం కొన్ని జాగ్రత్తలు పాటిస్తే జ్వరాల బారి నుంచి తప్పించుకోవచ్చు.

- వ్యాధులు రాకుండా ఎవరికివారు వ్యక్తిగత శుభ్రతను పాటించాలి.
- బయటకు వెళ్లేటపుడు కాళ్లను, చేతులను కప్పి ఉంచే దుస్తులను వేసుకోవాలి.
- ఇంట్లో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు మార్చుతుండాలి.
- వారానికోమారు డ్రైడేను పాటిస్తే దోమలార్వా చనిపోతుంది.
- నీటి సంపులు, ట్యాంకులపై తప్పకుండా మూతలు పెట్టుకోవాలి.
- పాతటైర్లు, కప్పులు, పాత్రలు, కొబ్బరి చిప్పలు పరిసరాల్లో ఉండకుండా చూడాలి.
- ఇంటి కిటికీలు, తలుపులకు దోమలు రాకుండా వైర్‌నెట్‌లను అమర్చుకోవాలి.
- పిల్లలకు దోమలు కుట్టకుండా పైపూత మందులు వాడుకోవచ్చు.
- జ్వరం రాగానే వెంటనే వైద్య పరీక్షలు చేసుకుని వ్యాధిని నిర్ధారించుకోవాలి
- డెంగీ ఆరంభ దశలో తెల్లరక్తకణాలు తగ్గుతాయి. తర్వాత ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి.
- మలేరియాలో చర్మంపై దద్దుర్లు చాలా అరుదుగా మాత్రమే కనిపిస్తాయి.
- ఉన్న చోట్ల అందరికీ ఒకేసారి యాంటీ పైలేరియా మందులను ఇవ్వడం ద్వారా వ్యాధి కారకాలు పూర్తిగా నశిస్తాయి.



బైక్ దొంగ అరెస్ట్



బైక్ దొంగను అరెస్ట్ చూపిస్తున్న పోలీసులు

కాణిపాకం: ద్విచక్ర వాహనాల దొంగను పట్టుకుని, రూ.18లక్షలు విలువ చేసే 12 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాణిపాకం పోలీస్ స్టేషన్‌లో బుధవారం సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ రామ్మోహన్ సమక్షంలో అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. ఉదయం కాణిపాకం పోలీసులు ముద్దిపట్లపల్లి క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అటువైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న బంగారుపాళెం మండలం బందలదొడ్డికి చెందిన తుమ్మల ఈశ్వర్ అలియాస్ కోటేశ్వర్‌రావు (35) పోలీసులను చూసి పరారయ్యాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతడిని వెంబడించి పట్టుకున్నారు. బండికి సంబంధించిన పత్రాలపై విచారించారు. ఈ క్రమంలో బండిని కాణిపాకంలో చోరీ చేసినట్లు తుమ్మల ఈశ్వర్ పోలీసులకు చెప్పాడు. దీంతో అతడిని కాణిపాకం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తే దాచిపెట్టిన ద్విచక్ర వాహనాల గుట్టు విప్పాడు. వెంటనే పోలీసులు బంగారుపాళెం మండలం శివపురం ఎస్టీ కాలనీ వద్ద దాచి ఉంచిన రూ.8 లక్షలు విలువ చేసే 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని చిత్తూరు, బంగారుపాళ్యం, తవణంపల్లె, ఐరాల, తిరుపతి, తిరుచానూరు, పెనుమూరు, యాదమరి, రేణిగుంట, కాణిపాకం ప్రాంతాల్లో దొంగతనం చేసినట్లు నిర్ధారించారు. దీంతో నిందితునిపై కేసు నమోదు చేయడంతో పాటు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చాకచక్యంగా నిందితుడిని గుర్తించి పట్టుకుని, 12 ద్విచక్ర వాహనాలను రికవరీ చేసిన పోలీసులను అభినందించారు.

దొంగల బండిలో వరాహాలు

- వందకుపైగా పందుల తస్కరణ
- నిమ్మనపల్లె వద్ద పట్టుబడిన నిందితులు
- 82 జీవాలు స్వాధీనం, రూ.1.71 లక్షల నగదు
- డీఎస్పీ రఘువీర్ విష్ణు వెల్లడి



నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ చిన్నగోవింద్, పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్ విష్ణు

గంగవరం: దొంగల బండిలోకి ఊర పందులు వచ్చి చేరాయి. ఇప్పటివరకు రకరకాల దొంగతనాలు చేసి బోరు కొట్టినట్టుంది. అందుకే ఈ సారి ఊరపందుల మీద పడ్డారు. ఐదుగురు కలిసి సుమారు 200 పందుల వరకు తస్కరించేశారు. ఈ మేరకు గంగవరం పోలీస్ స్టేషన్లో బుధవారం పలమనేరు డీఎస్పీ రఘువీర్‌విష్ణు, సీఐ చిన్నగోవింద్ వివరాలను మీడియాకు వెల్లడించారు.

పలమనేరు నియోజకవర్గంలోని గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో ఇటీవల రాత్రి కొట్టంలోకి తోలిన ఊర పందులు తెల్లవారేసరికి మాయమయ్యేవి. ఉదయం తమ జీవాలు కనిపించకపోవడంతో తప్పించుకుని మేతకు వెళ్లాయేమో అనుకున్నారు వాటి యజమానులు. ఇలా గత రెండు నెలల వ్యవధిలో వందకుపైగా పందులు తప్పిపోయాయి. గంగవరం మండలం బెస్తగానిపల్లె వద్ద 45, అరసనపల్లెలో 35 పందులు, పెద్దపంజాణి మండలం రాజుపల్లి వద్ద 20కి పైగా దొంగతనానికి గురయ్యాయి. ఈ వరుస చోరీలపై యజమానులు వెంటనే ఆయా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు కేసులు నమోదు చేసి ప్రత్యేక బృందంతో దర్యాప్తు ప్రారంభించారు.

ఇలా దొరికేశారు

మదనపల్లె సమీపంలోని నిమ్మనపల్లె వద్ద పందులు విక్రయిస్తున్నట్లు పోలీసు బృందానికి మంగళవారం సమాచారం అందింది. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు ఐదుగురు నిందితులను పట్టుకున్నారు. వారి దొంగతనానికి వినియోగించిన వాహనంతోపాటు ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు అనంతపురం జిల్లాలోనూ పందుల దొంగతనం చేసినట్లు తేలింది. అక్కడ కూడా దాదాపు 112 పందులను దొంగిలించినట్లు రుజువైంది. వీటిని మదనపల్లె శివార్లులో పందుల వ్యాపారులకు కిలో రూ.190 లెక్కన విక్రయించినట్లు వెల్లడించారు. వారి నుంచి 82 పందులతోపాటు రూ.1.71 లక్షల నగదును పోలీసులు రికవరీ చేశారు. పట్టుబడిన పందుల విలువ రూ.9.29 లక్షలు ఉంటుందని చెప్పారు. పట్టుబడిన నిందితుల్లో అనంతపురం జిల్లా రాప్తాడు మండలం మాది చిన్మయి నగర్‌కు చెందిన డ్రైవర్ చంద్రశేఖర్, ఇందిరమ్మ కాలనీకి చెందిన పందుల వ్యాపారి డేరంగుల విజయ్, గుజిరీ వ్యాపారస్తుడు ఎరుకుల వాసు, వెల్డింగ్ షాపు నిర్వాహకుడు బెస్త రాకేష్, అనంతపురం టౌన్‌కు చెందిన సురేంద్ర ఉన్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసు బృందాన్ని డీఎస్పీ అభినందించారు.

సులభంగా పందుల అపహరణ

ఊర పందులు అన్ని ఊళ్లలో ఉండవు. చాలా ఊర్లలోకి వాటిని రానివ్వరు. అంతేకాకుండా ఎక్కడో కొన్ని గ్రామాల్లో ఇద్దరో ముగ్గురో ఈ పందుల పోషణపై ఆధారపడి జీవిస్తుంటారు. వీళ్లు ఊరి చివరన చిన్నపాటి కొట్టం ఏర్పాటుచేసుకుని పందులు మేపుకుంటారు. పగలంతా వాటిని మేపడం రాత్రి కొట్టంలో తోలేసి ఇళ్లకు వెళ్లిపోతారు. వీటికి కాపలా కూడా ఉండరు. దీంతో వీటిపై దొంగల కన్ను పడింది. తస్కరించేటపుడు పందులు అరిచినా అవి ఊరి చివరన ఉంటాయి కాబట్టి ఎవరూ పట్టించుకోరు. ఈ కారణంగా వీళ్ల పని సులభమైంది. వీరు ట్రాలీ వాహనం తీసుకెళ్లి పందులను అందులోకి ఎక్కించి తస్కరించేవారు. ఆ తరువాత వాటిని కిలో రూ.190 చొప్పున విక్రయించేవారు.

మీ బిల్లును మీరే లెక్కించుకోవచ్చు

- ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌లో మరిన్ని ఫీచర్లు
- విద్యుత్ వినియోగం తెలుసుకునే వెసులుబాటు
- అందుబాటులో గత చెల్లింపుల వివరాలు

చిత్తూరు కార్పొరేషన్: గంటల సేపు క్యూలో నిలబడి బిల్లులు కట్టే కాలం మారిపోయింది. ప్రస్తుతం సమయం విలువైనది. యూపీఐ యాప్స్‌లో పలు బిల్లింగ్ పేమెంట్స్ అందుబాటులోకి వచ్చాక అందులోనే చెల్లింపులు చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం యూపీఐ యాప్స్‌లో పేమెంట్ ఆప్షన్ తీసివేశారు. కరెంటు బిల్లు కట్టాలంటే విద్యుత్‌శాఖ వెబ్‌సైట్‌లో నేరుగా చెల్లించే అవకాశం కల్పించారు. ఏపీఎస్పీడీసీఎల్ యాప్ లేదా వెబ్‌సైట్‌లో కరెంటు బిల్లు చెల్లింపుతో పాటు సర్వీసు పరంగా పలు వివరాలను తెలుసుకునే అవకాశం కల్పించారు.

అందుబాటులో కొత్త ఫీచర్లు

గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ మొబైల్ యాప్ డౌన్లోడ్ చేసుకుని వినియోగ దారుడి 16 అంకెల సర్వీస్ నంబర్ నమోదు చేసుకోవడం ద్వారా మొబైల్ యాప్ సేవలను పొందవచ్చు. ఇందులో మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకొని లాగ్ఇన్ ఇవ్వాలి. తర్వాత యాప్‌లో 'బిల్ పే' ఆప్షన్ ద్వారా విద్యుత్ బిల్లులను ఎలాంటి అదనపు రుసుం లేకుండా సులభంగా కట్టవచ్చు. వినియోగదారు సర్వీసుకు సంబంధించిన విద్యుత్ వినియోగం, బిల్లు వివరాలు, బిల్లు చెల్లింపు, విద్యుత్ సరఫరా పరిస్థితి వివరాలు తెలుసుకునేలా సరికొత్త ఫీచర్లు అందుబాటులో ఉంచారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు

'మై యూసేజ్' ఆప్షన్ ప్రస్తుత వినియోగపు యూనిట్ల సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును లెక్కించుకోవచ్చు. యాప్ ద్వారా ఆధార్ నంబర్‌కు విద్యుత్ సర్వీసును అనుసంధానం చేసుకోవడంతోపాటు విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. బిల్‌పే ఆప్షన్‌లో మన సర్వీసు నంబరు, యజమాని పేరుతో పాటు కేటగిరి బిల్లు ఇచ్చిన తేదీ, కట్టాల్సిన మొత్తం వివరాలు అందులో ఉంటుంది. వీటితో పాటు కనెక్షన్ ఆప్షన్‌లో కొత్త కనెక్షన్, దాని రుసుం, అప్లికేషన్ స్టేటస్, ఆన్‌లైన్ సర్వీస్ రిక్వెస్ట్ వివరాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. మొబైల్ నంబరు అనుసంధానం చేసుకునే అవకాశం కల్పించారు.

గత చెల్లింపుల వివరాలు

ఈ యాప్‌లో పేమెంట్ హిస్టరీలో ప్రతి నెలా చెల్లించిన బిల్లుల వివరాలు చూసుకోవచ్చు. వీటితో పాటు ఎన్ని యూనిట్లు వినియోగించాం.. కరెంటు బిల్లు ఎంత... ఇతర చార్జీల వివరాలతో కలిపి మొత్తం బిల్లు ఎంత అనే వివరాలు తెలుసుకోవచ్చు. వీటితో పాటు లైట్, ట్యూబ్ లైట్, ఫ్రిజ్, ఏసీ, కూలర్, ఫ్యాన్, ఐరన్‌బాక్స్, గీజర్, వాషింగ్ మెషీన్, టీవీ, మిక్సీ, గ్రైండర్, కంప్యూటర్, నీళ్ల మోటార్ వంటి విద్యుత్ పరికరాలు ఎన్ని ఎంత సేపు వాడితే నెలకు ఎన్ని యూనిట్లు రావచ్చు అనే అంచనా వివరాలు తెలుసుకోవచ్చు. ఇంక సర్వీసు ఏ సెక్షన్ పరిధిలో ఉంది, ఏ ఫీడర్, సబ్‌స్టేషన్ నుంచి సరఫరా వస్తున్నది. ఏఈ, డీఈ నంబర్లు కూడా అందుబాటులో ఉంచారు. వీటితో పాటు ఫిర్యాదులు చేసుకునే సౌలభ్యమూ ఉంది. మీటర్, బిల్లింగ్, స్లపయ్, ఇన్సిడెంట్, ఓల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ వంటి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు.

ఎంతో ఉపయోగం



ఏపీఎస్పీడీసీఎల్ యాప్ లేదా సైట్ ద్వారా చెల్లింపులు చేస్తే నేరుగా సంస్థ ఖాతాలో పడుతుంది. వినియోగదారులకు మరిన్ని ఫీచర్లతో సమాచారం తెలుసుకునే అవకాశం కల్పించారు. వాడకం, ఫిర్యాదు, కేటగిరి, సరఫరా వివరాలతో పాటు పలు విషయాలను తెలుసుకోవచ్చు. ఎటువంటి సమస్యలు ఉన్నా టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫిర్యాదు చేయండి.

– సురేంద్రనాయుడు, ఎస్ఈ, ట్రాన్స్‌కో

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతిచెందిన రాజ్‌కుమార్

పలమనేరు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద ఓ వ్యక్తి బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారాన్ని అందించారు. విచారించిన పోలీసులు మృతుడు బైరెడ్డిపల్లి మండలం పాతపేటకు చెందిన చంద్రప్ప కుమారుడు రాజ్‌కుమార్(27)గా తెలుసుకున్నారు. ఫిట్స్ కారణంగా మృతి చెందినట్లు తెలుస్తోందని వారు భావిస్తున్నారు. కాగా దీనిపై విచారణ చేపట్టి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ప్రయాణికులకు తప్పిన ముప్పు

శాంతిపురం: అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకుపోయిన సంఘటన బుధవారం మండలపరిధిలో చోటుచేసుకుంది. కర్ణాటకలోని కేజీఎఫ్ నుంచి కుప్పం వస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సుకు రాళ్లబూదుగూరు పెట్రోల్ బంకు సమీపంలోని మలుపు వద్ద ద్విచక్ర వాహనం అడ్డు వచ్చింది. దాన్ని తప్పించే ప్రయత్నంలో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు వెళ్లగా డ్రైవర్ బస్సును నిలిపివేశారు. దీంతో పల్లపు ప్రాంతంలోకి వెళ్లి వాలిపోయిన బస్సు నుంచి ప్రయాణికులు, కండక్టర్లు సురక్షితంగా కిందికి దిగారు. ఆ తరువాత డ్రైవర్ బస్సును రివర్స్ గేరులో మళ్లీ రోడ్డుపైకి తీసుకొచ్చి, అదే బస్సులో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో బస్సులోని 25 మంది సురక్షితంగా బయటపడ్డారు.

చోరుల ముఠాకు సంకెళ్లు



స్వాధీనం చేసుకున్న నగలు, అరెస్ట్ చేసిన నిందితులను చూపుతున్న పోలీసు అధికారులు

పాకాల: దొంగల ముఠాను అరెస్ట్ వారి నుంచి నగలు, మూడు మోటార్ సైకిళ్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో తిరుపతి డీఎస్పీ నరసింగప్ప తెలిపిన వివరాలు.. ఈ నెల 16న పాకాల ఎస్ఐలు మహేష్‌బాబు, లోకేష్‌కుమార్ పోలీసులతో కలిసి నేంద్రగుంట అండర్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేశారు. అదే సమయంలో పెనుమూరు వైపు నుంచి మోటార్ సైకిళ్లలో వచ్చిన నలుగురు యువకులు పోలీసులను చూసి పరారయ్యారు. ఇది గమనించి వారిని వెంటాడి అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో.. పూతలపట్టు మండలం, వావిల్‌తోటకు చెందిన అన్నదమ్ములు ఎన్.మురళి(21), ఎన్.బాబు(20), పెనుమూరు మండలం మటంపల్లెకు చెందిన హర్షవర్ధన్ (22), గంగుపల్లెకు చెందిన వరుణ్‌కుమార్ (22) అని, వీరంతా చైన్ స్నాచర్ల ముఠా అని తేలింది. రోడ్డు పక్కన ఆపి ఉన్న వాహనాల్లో గ్యాస్ సిలిండర్లు, బ్యాటరీలు చోరీ చేయడం, ఒంటరిగా వెళ్తున్న మహిళల నుంచి చైన్లు స్నాచింగ్ చేయడమే కాకుండా తాళం వేసి వేసిన ఇళ్లలో కూడా చోరీలకు పాల్పడే వారని విచారణలో వెల్లడైంది. నిందితుల నుంచి రూ.5 లక్షల విలువ చేసే 87 గ్రాముల బంగారు ఆభరణాలు, దొంగతనాలకు ఉపయోగించిన మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక వావిల్‌తోటకు చెందిన అన్నదమ్ములిద్దరూ గతంలో చోరీ కేసుల్లో బాల నేరస్తులుగా జైలు శిక్ష సైతం అనుభవించారని, అయినా వీరి తీరు మారలేదని డీఎస్పీ చెప్పారు. నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీరాములు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : నవోదయ విద్యాలయాల్లో 2025-26వ విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ వెలువడింది. ఆ మేరకు తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయాలు దేశవ్యాప్తంగా 653, ఇందులో మన రాష్ట్రంలో 15, తెలంగాణలో 9 ఉన్నాయన్నారు. ఈ విద్యాలయాల్లో అత్యున్నత ప్రమాణాలతో సీబీఎస్ఈ సిలబస్‌తో ఉచిత విద్య, అలాగే ఉచిత వసతి, భోజనం సౌకర్యాలు కల్పిస్తారని తెలిపారు. రెగ్యులర్ చదువుతో పాటు నీట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తారన్నారు. ఏటా ఒక్కో నవోదయ విద్యాలయంలో 80మందికి ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తారని పేర్కొన్నారు. 2025, జనవరి 18వ తేదీన జాతీయ స్థాయిలో నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్టు(జేఎన్‌వీఎస్‌టీ)కు ఈ ఏడాది 5వ తరగతి చదివే విద్యార్థులు అర్హులని, దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబరు 16వ తేదీ ఆఖరు అని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించి పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

వామ్మో చిరుత..!


- కొటాల జగనన్న కాలనీ సమీపంలో సంచారం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియో
- అప్రమత్తమైన అటవీ అధికారులు

చంద్రగిరి: జనావాస ప్రాంతాల సమీపంలో చిరుత సంచరించడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మండలంలోని కొటాల జగనన్న కాలనీ సమీపంలోని శేషాచల అటవీ ప్రాంతంలో మంగళవారం ఓ చిరుత పులి వచ్చినట్లు వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. కాలనీకి కిలోమీటరు దూరంలోని ఓ పెద్ద బండపై చిరుత పులి ఉండటాన్ని గమనించిన స్థానికులు హడలిపోయారు. వెంటనే మేడపై నుంచి తమ సెల్‌ఫోన్లలో చిరుత పులి సంచారాన్ని వీడియో తీశారు. అనంతరం సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడంతో ఇవి వైరల్ అయ్యాయి. చిరుత పులి కాలనీలోకి వచ్చే అవకాశం ఉందంటూ స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణం పనులు చేస్తుండడంతో లబ్ధిదారులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వీడియోలను పరిశీలించిన అటవీ అధికారులు అది చిరుతగా తేల్చారు. నివాస గృహాల వైపు రాకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు.

అంతరిక్షాన్ని చూసేద్దాం!

- డిజిటల్ ప్లానిటోరియం పునఃప్రారంభం
- విద్యార్థులను ఆకట్టుకున్న సరికొత్త ప్రదర్శన

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో బుధవారం నగరపాలక కమిషనర్ అదితిసింగ్ చేతుల మీదుగా సరికొత్త ప్రదర్శనతో డిజిటల్ ప్లానిటోరియాన్ని పునఃప్రారంభించారు. చంద్రునిపై మానవుడు అడుగుపెట్టిన సందర్భంగా స్పేస్ వీక్-2024 పేరిట బుధవారం నుంచి 23వ తేదీ వరకు ఇక్కడ వివిధ పోటీలు నిర్వహణకు శ్రీకారం చుట్టారు. చారిత్రాత్మక ‹మ్యాన్ ల్యాండింగ్ మిషన్› ప్రాముఖ్యతను.. మానవ జాతి అభివృద్ధికి మిషన్‌ను విజయవంతం చేయడానికి అవిశ్రాంతంగా పనిచేసిన శాస్త్రీయ సమాజం ప్రయత్నాలను అదితి సింగ్ వివరించారు. పట్టుదల, విజయవంతం కావాలని.. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనే సంకల్పం ఉండాలన్నారు. అనంతరం 25 నిమిషాల నిడివి గల 'ది సన్ అవర్ లివింగ్ స్టార్' పేరుతో కొత్త ప్లానిటోరియం షోను ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి ప్రదర్శనను వీక్షించారు. అంతరిక్ష శాస్త్రంపై మెరుగైన అవగాహన కోసం ఇలాంటి షోలు చూడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సైన్సు సెంటర్ చేస్తున్న కృషిని అభినందించారు. రోజుకు 5 షోలు ప్రదర్శించనున్నట్టు కేంద్రం కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ చెప్పారు. తొలిరోజు 600మంది విద్యార్థులు షోను వీక్షించారని తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పురుషోత్తం, కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



ప్రదర్శనలో సౌర మండలం దృశ్యం



సైన్స్ సెంటర్‌లో ఆసక్తిగా చూస్తున్న విద్యార్థులు



వీక్షిస్తున్న విద్యార్థులు

అవధానం విద్యార్థులకు జ్ఞానయజ్ఞం

తిరుపతి సిటీ: అవధాన ప్రక్రియ జ్ఞాన యజ్ఞం లాంటిదని, విద్యార్థుల మేధోసంపత్తిని పెంపొందించేందుకు ఉపయోగపడుతుందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం వర్సిటీలో చెలికాని అన్నారావు భవనంలో జరిగిన అవధాన సంగమం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు అవధానంపై ఆసక్తిని కలిగించి, విభిన్న అవధాన ప్రక్రియలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రాచీన విద్య అయిన అవధాన ప్రక్రియను ఆధునిక కాలంలోని విద్యార్థులు తెలుసుకుని, జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం స్విమ్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడిసన్ విభాగాధిపతి ప్రొఫెసర్ అల్లాడి మోహన్ మాట్లాడుతూ అవధాన ప్రక్రియలో విభిన రకాలైన అవధానాల ద్వారా విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో రిషివుడ్ వర్సిటీ మానవ విజ్ఞానకేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సదానంద మిశ్రా, ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి, డాక్టర్ వైష్ణవి, డీన్లు ప్రొఫెసర్ దక్షిణమూర్తి శర్మ, ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.